పథకాలతో ఆర్థిక భరోసా


గొల్లపల్లెలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: సంక్షేమ పథకాల అమలుతో ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పిస్తూ సుభిక్ష పాలన అందిస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. శనివారం మండలంలోని గుండ్లపల్లె సచివాలయ పరిధిలోని గొల్లపల్లె, పేయన్నగారిపల్లె, పేయన్న గారిపల్లె దళితవాడ, పేయన్నగారిపల్లె ఎస్టీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 200 ఇళ్లను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని అంకెలతో సహా వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకాలు చేరుతున్నాయా లేదో తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించి, ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటున్నట్లు వివరించారు. ఇంటి పట్టాలు ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని పేయన్న గారిపల్లె ఎస్టీ కాలనీ వాసులు ఎమ్మెల్యేకు నివేదించారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం పార్టీ నేతలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరూ అలసత్వం ప్రదర్శించకూడదని పేర్కొన్నారు. ప్రతి 20 రోజులకు ఒక్కసారి గ్రామాల్లో సభలు నిర్వహించి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. గుండ్లపల్లె సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ మోహన్, సర్పంచులు రెడ్డెమ్మ, శాంతిసాగర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు ముదిగోళం సురేంద్రరెడ్డి, గణేష్‌రెడ్డి, టెరిన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్, సురేష్‌రెడ్డి, సురేంద్రయాదవ్, మురళి, రాము, ప్రసాద్, ధనంజయ, రవిరెడ్డి, తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎక్స్‌ప్రెస్ రోడ్డుకు అనుమతులు

చిత్తూరు కార్పొరేషన్: బెంగుళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ రోడ్డు ప్యాకేజీ–2కి కేంద్ర అటవీశాఖ అనుమతులు ఇచ్చిందని ఎన్‌హెచ్‌ఏ పీడీ కార్తీక్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర, జిల్లా అటవీశాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తామన్నారు. బైరెడ్డిపల్లె నుంచి వీ.కోట వరకు మొత్తం 31 కిలోమీటర్లు పనులను జూన్‌లో మొదలు పెడతామన్నారు. అలాగే చిత్తూరు–టచ్చూరు రోడ్డు ప్యాకేజీ 1, 3 పనులు వరదరాజులపల్లె నుంచి తమిళనాడు సరిహద్దు వరకు, నగరి నుంచి ఎస్ఎస్‌బీ పేట వరకు జరుగుతున్నాయని వివరించారు.

85 మందికి వైద్య పరీక్షలు


గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

తవణంపల్లె: మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్ 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగి రాజారెడ్డికి ఇంటికి వెళ్లి ఆరోగ్య స్థితిగతులకు తెలుసుకుని వైద్యం అందించారు. ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, కళావతి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధి నిరోధక శక్తి

తవణంపల్లె: పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు టీకాలు తప్పని సరిగా వేయించాలని ఆరోగ్య కార్యకర్త నవనీతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.పావని తెలిపారు. శనివారం జి.వడ్డిపల్లె అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు టీకాలు కార్యక్రమం నిర్వహించారు.

రేపు కంటి వైద్య శిబిరం

యాదమరి: మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్ ఆవరణలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పెరియంబాడి నాగరాజు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చెన్నై ఎంఎస్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేస్తారని తెలిపారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: పూతలపట్టు మండలంలో జగనన్న కాలనీలో లబ్ధిదారులు చక చక ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేస్తున్నారని ఎంపీడీఓ గౌరి అన్నారు. శనివారం మండలంలోని తేనేపల్లె పంచాయతీ జగనన్న కాలనీని ఆమె పరిశీలించారు. వేగవంతంగా నిర్మాణాలు పూర్తి చేస్తున్న లబ్ధిదారులను అభినందించారు. 52కు గానూ 30 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు.

సంఘమిత్రపై చర్యలు తీసుకోవాలి


అధికారులకు ఫిర్యాదు చేస్తున్న మహిళా సంఘ సభ్యులు

వి.కోట: వెలుగు గ్రూపుల్లో తమ సొమ్మును గోల్‌మాల్ చేసిన సంఘమిత్రపై చర్యలు తీసుకుని, తమ సొమ్మును జమచేయాలని వెలుగు సభ్యులు ఆందోళన చేశారు. శని వారం మండలంలోని తోటకనుమ పంచాయతీ మోర్నపల్లెలో వెలుగు అధికారులు గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వంచారు. మహిళా సభ్యులు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలోని గ్రూపుల తరుపున వసూలు చేసిన రూ.7 లక్షల వరకు గోల్‌మాల్ అయినట్టు తేలిందని తెలిపారు. ఆ నగదును తమకు చెల్లించాలని వెలుగు సీసీలతో వాగ్వాదానికి దిగారు. అధికారులతో చర్చించి త్వరలోనే గ్రూపుల సొమ్మును రికవరీ చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు.

ఆర్టీసీ డిపోలో సంబరాలు

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపోను ప్రారంభించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్ మజ్దూర్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, మేనేజర్ సుధాకరయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కేక్ కట్ చేసి పంచారు. జయరామిరెడ్డి మాట్లాడుతూ డిపోను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు పీఆర్.కృష్ణ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనులపై సమీక్ష

సోమల: సోమల సచివాలయంలో పీఓ శోభారాణి అధ్యక్షతన వాటర్ షెడ్ పనులపై శనివారం సమీక్ష జరిగింది. వైస్ చైర్మన్ పీఎల్ఆర్ రాజారెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో చేపడుతున్న పనులను వివరించారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మొగిలప్పగారి శ్రీనివాసులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ద్రౌపదీమాత ఊరేగింపు



గుడిపాల: మండలంలోని పానాటూరులో ధర్మరాజుల ఆలయం వద్ద శనివారం ఉదయం ద్రౌపదీమాతకు గ్రామస్తులు అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. వీటికి ఉభయదారులుగా పానాటూరు సర్పంచ్ పల్లవి, మధుసూదన్‌రెడ్డి వ్యవహరించారు. రాత్రి విద్యుత్ దీపాలంకరణ, పండరి భజన, బాణసంచా మోత నడుమ అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

40 లీటర్ల సారా స్వాధీనం : ఇద్దరి అరెస్ట్


సారా తరలిస్తూ పట్టుబడిన నిందితులతో సెబ్ సిబ్బంది

గుడిపాల: 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేయడంతోపాటు 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఎస్ఈబి చిత్తూరు అర్బన్ సీఐ జోగేంద్ర తెలిపిన వివరాలు..అందిన రహస్య సమాచారం మేరకు మండలంలోని చిత్తపార అటవీ ప్రాంతంలో సెబ్ సీఐ తన సిబ్బందితో దాడులు చేశారు. సారా ఊటను ధ్వంసం చేశారు. అలాగే చిత్తపారకు చెందిన ధర్మాగౌడ్(62), రవి (42) 40 లీటర్ల సారా తీసుకువెళుతుండగా వారిని అరెస్ట్ చేశారు. దాడుల్లో ఎస్ఐ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్వాధీనం


చిత్తూరు అర్బన్: తవణంపల్లె మండలంలో ఎస్ఈబీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. సరకల్లు ప్రాంతంలో సారా విక్రేత చిన్నదొరయ్యను అరెస్ట్ చేసి అతని వద్ద 5లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య, సుబ్రమణ్యం, వెంకటేష్, కిరణ్‌కుమార్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

స్థల సమస్య పరిష్కారం


ooooooooo

పూతలపట్టు: అక్రమణకు గురైన స్థలాన్ని శనివారం అధికారులు, నాయకులు పరిష్కరించారు. మండలంలోని పాటూరు పంచాయతీ కొత్తపల్లెకు చెందిన ఓ వ్యక్తి ఆలయం పరిధిలోని కొంత స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్తులు స్పందనలో ఫిర్యాదు చేశారు. శనివారం అధికారులు, నాయకులు స్థలాన్ని సర్వే చేసి సమస్యను పరిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తలపులపల్లి బాబురెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

వేడుకగా శ్రీనివాస కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సదుం: మండలంలోని బూరగమందలోని శ్రీశ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం గరుడ వాహనంలో దేవదేవుడు గ్రామ వీధుల్లో విహరించారు. మునుస్వామి, వెంకటరమణ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, భక్తులు

చిత్తూరు మండలంలో 76.38 శాతం ఉత్తీర్ణత

చిత్తూరు రూరల్: పదిపరీక్ష ఫలితాల్లో మండలానికి 76.38 శాతం ఫలితాలు వచ్చాయని ఎంఈఓ సెల్వరాజ్ తెలిపారు. 202–23 విద్యాసంవత్సరానికి మండలంలో 199మంది విద్యార్థులు పది పరీక్షలు రాశారన్నారు. అయితే శనివారం ప్రభుత్వం ప్రకటించిన పది ఫలితాల్లో 152 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 47 మంది ఫెయిల్‌అయ్యారని..దీంతో మండలానికి 76.38 శాతంఫలితాలు వచ్చాయన్నారు.

పూతలపట్టు నియోజకవర్గంలో 62 శాతం ఉత్తీర్ణత

యాదమరి: పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పదో తరగతి ఫలితాలలో 62శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు విద్యాశాఖ అధికారులు శనివారం తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 44 ఉన్నత పాఠశాలల్లో 2,076మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 1,280 మంది ఉత్తీర్ణులయ్యారు. తవణంపల్లె మండలంలో 66 శాతం, ఐరాల మండలంలో 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. యాదమరి మండలంలో 363 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, 167 మంది ఉతీర్ణులయ్యారు. బంగారుపాళెం మండలంలో 41 శాతం ఉత్తీర్ణత సాధించారు. 569 మంది పరీక్షలు రాయగా, 233 మంది పాసయ్యారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలో 75.67 శాతం టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రామ్‌నాయక్ తెలిపారు.

కర్ణాటక ఎన్నికలకు 200 మంది సిబ్బంది

చిత్తూర్ అర్బన్: కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి చిత్తూరు పోలీసు శాఖ నుంచి 2500 మంది సిబ్బంది శనివారం రాత్రి బయలుదేరి వెళ్లారు. ఈనెల 10న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల సంఘం జిల్లా నుంచి పోలీసు సిబ్బందిని కోరింది. వంద మంది చొప్పున కానిస్టేబుళ్లు, హోంగార్డులను కేటాయిస్తూ రిశాంత్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎక్కువ కేసులు పరిష్కరిద్దాం

పలమనేరు: పట్టణ సమీపంలోని ఫస్ట్‌క్లాస్ మెజి స్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో ఈనెల 13 జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం ఆయన జూనియర్ సివిల్ జడ్జి రవితో కలసి నియోజకవర్గంలోని పోలీసులు, న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని, కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా కేసులను రాజీ చేసుకుని శాంతిపూర్వకంగా ఉండేలా జీవించాలన్నారు. లోక్ అదాలత్‌లో ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ శ్రేయస్కరమని తెలిపారు. మండలాల్లో పోలీసులు లోక్‌అధాలత్‌పై ప్రత్యేక చొరవచూపాలని సూచించారు. పలమనేరు, గంగవరం, సీఐలు బైరెడ్డిపల్లె, వీకోట మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈనెల 13న జరుగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు కోరారు. శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి సిందుతో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు.

చిన్నారులకు బహుమతులు


బహుమతులు అందుకున్న చిన్నారులు

పలమనేరు: పట్టణ సమీపంలోని కళామందిరంలో నైతిక విలువలపై చిన్నారులకు సాగుతున్న వేసవి శిక్షణలో భాగంగా శనివారం నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపిన నలుగురికి బహుమతులు అందజేశారు. నిర్వాహకుడు తులసీనాథం నాయుడు మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కారం, విలువలను నేర్పాలనే ఉద్దేశంతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

రికార్డులు సక్రమంగా లేకుంటే ఇంటికే..


అగ్రికల్చర్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న జేడీ

గుడిపాల: రికార్డులు సక్రమంగా లేకుంటే ఇంటికి పంపిస్తామని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ హెచ్చరించారు. శనివారం మండలంలోని నారగల్లు, 197రామాపురం రైతు భరోసా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులన్నింటినీ సక్రమంగా నిర్వహించాలని, మరోసారి వచ్చినప్పుడు ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయానికి సంబంధించి 22 రికార్డులు ఉండాలని, ఏ ఒక్కటీ సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో కిసాన్ డ్రోన్‌లకు సంబంధించి ఎవరినైనా ఎంపిక చేయాలన్నారు. మండలంలో 320 మంది పీఎం కిసాన్ ఈ కేవైసీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయాధికారి మాధవి పాల్గొన్నారు. .

భూ ఆక్రమణ..ఆపై అక్రమంగా పట్టా


సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు

చిత్తూరు రూరల్: తమభూమిని కొందరు ఆక్రమించుకుని..అక్రమంగా పట్టా చేసుకున్నారని జీడీ నెల్లూరు మండలం ఎంఎన్ కుప్పం గ్రామానికి చెందిన ఝూన్సీ ఆరోపించింది. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వృత్తిరీత్యా తమ కుటుంబం చిత్తూరులోని కొంగారెడ్డిపల్లెలో స్థిరపడిందన్నారు. ఇదే అవకాశంగా చేసుకుని గ్రామానికి చెందిన 11మంది వ్యక్తులు తమ భూమిని కాజేశారని తెలిపారు. 7 ఎకరాల భూమిని పట్టా చేసుకున్నారని, రీ–సర్వే చేస్తున్నారని ఊరెళితే అసలు విషయం బయటపడిందన్నారు. దీనిపై అధికారులను కలిస్తే..పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

మరకాలకుప్పంలో 'ఫ్యామిలీ డాక్టర్'


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రక్షిత


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత పేరయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: వైద్యసేవలు అందించేందుకు ఇళ్ల వద్దకే వస్తున్నట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి రక్షిత అన్నారు. శనివారం మరకాలకుప్పంలో ఆమె ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బీపీ, మధుమేహం బాధితులతోపాటు గర్భవతులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది యమున, వనజ, శ్రీలక్ష్మి, దేవి, మార్కొండయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 76 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు ఇచ్చారు. హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎల్‌డీసీ ఉమాపతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాంబ్ బ్లాస్టింగ్‌తో బెంబేలు


రోడ్డుపై వాహనాలను ఆపివేసిన దళితవాడ ప్రజలు

- ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు
- వాహనాలన్నీ నిలిపివేసి నిరసన

గుడిపాల: చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేలో బాంబ్ బ్లాస్టింగ్ చేస్తూ రాళ్లన్నీ గ్రామం వైపు రావడంతో ఆగ్రహించిన గ్రామస్తులు శనివారం సాయంత్రం వాహనాలన్నింటినీ ఆపివేసి ఆందోళన చేశారు. పశుమంద దళితవాడ పక్కలో చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తున్నారు. ఈ పనులకు చేస్తున్న బ్లాస్టింగ్ మూలాన ఇళ్లు బీటలుబారుతున్నాయని గతంలోనే పనుల నిర్వాహకులకు తెలియజేశారు. అయితే పట్టించుకోకుండా బ్లాస్టింగ్ చేయడంతో శనివారం సాయంత్రం ఇళ్ల ఆవరణలో ఆడుకుంటున్న పిల్లల పక్కన రాళ్లు పడ్డాయి. అదృష్టశాత్తు ప్రమాదం బారిన పడలేదు. రాళ్ల పడటంపై ఆగ్రహించిన దళితవాడ ప్రజలు కంపెనీకి సంబంధించిన వాహనాలన్నింటినీ ఆపివేశారు. పనులు చేస్తున్న వారిని నిలదీశారు. దీనిపై గుడిపాల పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

సమస్యలపై తక్షణం స్పందించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపి తక్షణం పరిష్కరించాలని ఎంపీపీ యువరాజు సూచించారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలువల శుభ్రత, వీధి లైట్లు, చెత్త సేకరణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కరెంట్ బిల్లులు ఎక్కువ రావడంతో పలువురు పథకాలను పొందలేక పోతున్నారని కార్యదర్శులు ఈ సందర్భంగా ఎంపీపీకి విన్నవించారు. వెంటనే ఆయన రెస్కో ఎండీతో మాట్లాడారు. ఎంపీడీఓ మహేష్ పాల్గొన్నారు. అనంతరం ముదరందొడ్డి పంచాయతీ సుద్దుల కుప్పం సచివాలయం, రైతుభరోసా, విలేజ్‌క్లీనిక్, డెయిరీ నిర్మాణ పనులను ఎంపీపీ పరిశీలించారు. సర్పంచ్ దామోదరం, బీసీ సెల్ అధ్యక్షుడు భూపతి యాదవ్, నాయకులు నారాయణస్వామి, దామోదర్, ప్రసాద్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తి కట్టించిన దుర్యోధన వధ


దుర్యోధన, భీమ పాత్రధారుల యుద్ధ సన్నివేశం


కొలువుదీరిన పాండవుల విగ్రహాలు

గుడుపల్లె: యామగానిపల్లె శ్రీద్రౌపదీ ధర్మరాజుల ఆలయ మహా భారత ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్యోధనుని వధ ఘట్టం రక్తి కట్టించింది. ఆలయం సమీపంలోని గుడి సత్రం వద్ద దుర్యోధనుని ప్రతిమను ఏర్పాటు చేశారు. ఈ ప్రతిమ వద్ద పాండవులు, ద్రౌపదీ విగ్రహాలను ఉంచారు. అనంతరం దుర్యోధనుడు, భీముడు, ద్రౌపది వేషధారులు అక్కడికి చేరుకున్నారు. దుర్యోధన, భీమ పాత్రధారుల యుద్ధ సన్నివేశాలు జనాన్ని రంజింపజేశాయి. ఉరేగింపు జరిగింది. రాత్రి భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేల సంఖ్యలో జనం రావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఆదివారం పట్టాభిషేకం పొంగళ్లు నిర్వహించనున్నారు.